TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY



**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

9440555990



పబ్లిషర్ : హైదరాబాద్  సంపుటి :01  సంచిక : 319  శనివారం 26-07-2025  పేజీలు : 06  వేల : 05/-


# రేవంత్ రెడ్డి ప్రభుత్వం పచ్చి దళిత, గిరిజన వ్యతిరేకి

**- ఈ శతాబ్దపు అతిపెద్ద అబద్ధం కాంగ్రెస్ మ్యానిఫెస్టో**

**- రేవంత్ ప్రభుత్వ చేతిలో తెలంగాణలోని అన్ని వర్గాలు మోసపోయాయి**

**- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ను అమలుచేయకుండా దళిత, గిరిజనులను దగా చేసిన సీఎం రేవంత్**





ల బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని కేసీఆర్ సాకారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు చెప్పారు.లక్షలాది మందిని సమీకరించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని వాళ్లకు  బోధించి, ఎత్తిన జెండా దించకుండా 14 ఏళ్ల పాటు కేసీఆర్ పోరాడితేనే అంబేద్కర్ రాజ్యాంగం ఆధారంగా తెలంగాణ వచ్చిందన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట్ లో నిర్వహించిన దళిత ఆత్మగౌరవ గర్జనలో పాల్గొన్న కేటీఆర్, చేవేళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ను అమలుచేయకుండా దళిత, గిరిజనులపై అణిచివేతకు పాల్పడుతున్న రేవంత్ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా వదిలి పెట్టమన్నారు. జై తెలంగాణ ,జై భీమ్ నినాదాలతో ప్రసంగం మొదలు పెట్టిన కేటీఆర్..డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును సెక్రటేరియట్ కు పెట్టిన ముఖ్యమంత్రి భారతదేశంలో కేసీఆర్ ఒక్కరే అన్నారు. వేములవాడ పర్యటనలో ఒక్క ప్లేటు భోజనానికి లక్షా 35 వేల రూపాయలు ఖర్చు చేసిన రేవంత్ రెడ్డి, గురుకులాల్లోని దళిత, బహుజన బిడ్డలకు వంద రూపాయలతో మంచి భోజనం ఇవ్వలేకపోతున్నాడని విమర్శించారు. గురుకులాల్లో రేవంత్ ప్రభుత్వం పెడుతున్న విషం తిని ఇప్పటికే వందలాది విద్యార్థులు చనిపోయారన్నారు. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నాడు లింగంపేట బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర పోలీసుల చేతిలో అవమానానికి గురైన సాయిలును కేటీఆర్  ఘనంగా సన్మానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడిస్తేనే అహంకారంతో విర్రవీగుతున్న రేవంత్ రెడ్డి, ఆయన తొత్తులకు బుద్ధి వస్తుందన్నారు.సాయిలుకు జరిగిన అవమానం యావత్ తెలంగాణ సమాజానిది అన్న కేటీఆర్,  అందుకు కచ్చితంగా బదులు తీర్చుకుంటామన్నారు.

# చేనేత సమస్యలను పరిష్కరించాలని

**- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి వినతి**

**- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ**



హైదరాబాద్ : చేనేత సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు  ఉమ్మడి నల్గొండ మహబూబ్నగర్ జిల్లాలకు చెందిన సంఘాల నేతలు... శుక్రవారం హైదరాబాదులోని నివాసంలో రాజ్ గోపాల్ రెడ్డిని కలిసి పలు సమస్యలను విన్నవించారు... వాటిలో ముఖ్యంగా ప్రతి చేనేత మగ్గానికి ఉన్న జియో ట్యాగ్  అనుబంధ కార్మికులను మొత్తం ముగ్గురు ఉండేలా చూడాలని(గతంలో జియో ట్యాగ్ అనుబంధ కార్మికులు ముగ్గురు ఉండేవారు ప్రస్తుతం ఇద్దరికీ కుదించారు)... 350 సంఘాలకు సంబంధించిన 50 కోట్ల రుణాలను మాఫీ చేసి కొత్తగా మళ్లీ రుణాలను మంజూరు చేయాలని, చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని   కోరారు.. తన రాజకీయ ప్రస్థానమే చేనేత సంఘాల సమస్యల పరిష్కారంతో మొదలైందని  గుర్తు చేస్తూ... తప్పకుండా జియో టాగ్ అనుబంధ కార్మికుల పెంపు, రుణమాఫీ కొత్త రుణాల మంజూరు, చేనేత సంఘాలకు ఎన్నికల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాజ్ గోపాల్ రెడ్డిని కలిసిన వారిలో  ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన సిరిపురం, చౌటుప్పల్, మోత్కూరు, మునుగోడు, పలివెల, పుట్టపాక,  సొసైటీ సభ్యులతో పాటు మహబూబ్నగర్ జిల్లాకు చెందిన సొసైటీ సభ్యులు ఉన్నారు.

# నూతన సీడీపీఓలకు నియామక పత్రాలు అందజేసిన మంత్రి సీతక్క

**- సీడీపీఓల్లో ఉత్సాహం... తల్లిదండ్రుల్లో ఆనందం**

**- నియామక కార్యక్రమంలో పండుగ వాతావరణం**

**- ఇందిరా గాంధీ జయంతి రోజున వేయి నూతన అంగన్వాడీ భవనాలను ప్రారంభిస్తాం**

**- అప్పటి లోపు వాటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు**

**- సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క**



**హైదరాబాద్, జూలై 25:**  తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖలో నూతనంగా ఎంపికైన 23 మంది సీడీపీవోలకు నియామక పత్రాలను మంత్రి సీతక్క అందచేశారు.  తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన సీడీపీవోలు సచివాలయంలో మంత్రి చేతుల మీదుగా శుక్రవారం నాడు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పండుగ వాతావరణం నెలకొంది. నూతన సీడీపీఓలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినందుకు మంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖకు సీడీపీఓలు వెన్నెముకలుగా పని చేస్తారని పేర్కొన్నారు.”మీరు పొందిన ఈ ఉద్యోగం ఒక సామాజిక బాధ్యత. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మద్దతుగా నిలిచే సేవా విభాగంలోకి అడుగుపెడుతున్నారన్న విషయాన్ని మీరెప్పటికీ మరిచిపోవద్దు” అని మంత్రి తెలిపారు. “వేల మంది పోటీ పడిన ఈ పరీక్షలో మీరు మాత్రమే ఉద్యోగాలు పొందరు. ఈ విజయానికి మీరు చూపిన అంకితభావం ప్రధాన కారణం. మీరు నిర్వర్తించే విధుల్లో ఇదే అంకిత భావాన్ని కొనసాగించాలి” అని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు సేవలందించే అదృష్టం మీకు దక్కిందన్నారు.      అంగన్వాడీల్లో పోషకాహార లోపం తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ తో పాటు పాలు, గుడ్లను నిరంతరం సరఫరా  చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను ఆహ్లాద, ఆనంద కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. చిన్నారుల కోసం యూనిఫామ్స్ ను ఇవ్వడంతో పాటు 57 రకాల ఆటవస్తువులను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేశామన్నారు. అంగన్వాడీ సేవలను మరింత సమర్ధవంతంగా ప్రజలకు చేరవేయడం, లబ్ధిదారులకు అన్ని హక్కులు కల్పించడమే  ప్రధాన బాధ్యతగా సీడీపీఓలు పనిచేయాలన్నారు. కొత్తగా నియమితులైన అధికారులందరూ ఫీల్డ్ వర్క్ను ప్రాధాన్యంగా తీసుకుని, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యాలయాలకు పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వెళ్లాలని, ఏ విధమైన రాజకీయ ఒత్తిళ్లకు లోనవకుండా స్వేచ్ఛగా పనిచేయాలని సూచించారు మంత్రి సీతక్క. సీడీపీఓల్లో ఉత్సాహం... తల్లిదండ్రుల్లో ఆనందం మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న సీడీపీఓలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.”ప్రజా ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఉద్యోగ నియామక చర్యల వల్లే ఈ అవకాశాన్ని పొందగలిగాం” అంటూ ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లలు ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు చేపడుతున్న దృష్ట్యా పలువురు తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. కూతుళ్లను ప్రభుత్వ ఉన్నతోద్యుగులుగా చూడాలన్న తమ కల నెరవేరిందని, ఇటువంటి ప్రజా ప్రభుత్వం పదికాలాల పాటు కొనసాగాలి అంటు ప్రభుత్వాన్ని ఆశీర్వదించారు.అంతకు ముందు మహిళా శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ జీ సృజన తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గోన్న ఈ సమావేశంలో అంగన్వాడీ సేవల పని తీరు మెరుగుదల, పోషకాహార లోప నివారణ కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. శిధిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనాల స్థానంలో ఈ ఏడాది వేయి నూతన అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. దేశంలో అంగన్వాడి సేవలను ప్రవేశపెట్టిన ఇందిరా గాంధీ జయంతి రోజైన నవంబర్ 19న నూతన అంగన్వాడి భవనాలను ప్రారంభిస్తామన్నారు. అప్పటి లోపు ఈ ఏడాది నిర్దేశించుకున్న వేయి అంగన్వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా అంగన్వాడి కేంద్రాలను దేశానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దే విధంగా పనిచేయాలని సూచించారు. వర్షాకాలం తో వచ్చే సీజనల్ సమస్యల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షంలో నానడం వల్ల అంగన్వాడి భవనాలలో పెచ్చులు ఊడే ప్రమాదం ఉందని, అటువంటి భవనాలను గుర్తించి తక్షణం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేని చోట ప్రైవేట్ భవనాల్లోకి అంగన్వాడీ కేంద్రాలను మార్చాలని సూచించారు. రాత్రి వేళల్లో తేళ్ళు, జె ర్రీలు వంటి విష పురుగులు అంగన్వాడి కేంద్రాల్లోకి వచ్చే ప్రమాదముందని, ఉదయం సిబ్బంది రాగానే పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కొంతమంది సిబ్బంది నిర్లక్షం వల్ల కొన్నిచోట్ల చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని...విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.  జిల్లా అధికారులు అంగన్వాడి కేంద్రాలను విధిగా సందర్శించాలని, అంగన్వాడీల్లో హాజరు శాతాన్ని పెంచే చర్యలు చేపట్టాలన్నారు.  అంగన్వాడీ కేంద్రాల్లో ఫీడింగ్, టీచింగ్, అటెండెన్స్ మీద యంత్రాంగమంతా సృష్టి సారించాలని కోరుకున్నారు.

# ఉద్యోగులకు ఇంటెల్ సంస్థ  షాక్..

## త్వరలో 25 వేల మంది తొలగింపు..!

**న్యూ డిల్లీ జూలై 25 :** ప్రముఖ చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ గత కొన్ని రోజులుగా తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది మార్చిలో ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్-బు టాన్  బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో సంస్థ భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతోంది. ఇందులో భాగంగానే పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తోంది. ఇంటెల్ తాజాగా భారీగా ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.ది న్యూయార్క్ టైమ్స్ రిపోర్ట్ ప్రకారం.. సంస్థ త్వరలోనే 25,000 మందికిపైగా ఉద్యోగులను తొలగించనుంది. ప్రస్తుతం 1,08,900 మంది ఉద్యోగులున్న ఈ సంస్థ.. 2025 చివరి నాటికి ఉద్యోగుల సంఖ్యను 75,000కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇంటెల్ ఇప్పటికే సుమారు 15 శాతం అంటే సుమారు 15,000 ఉద్యోగాలను తగ్గించింది. గతేడాది 15 వేలకంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించింది. ఈ ఉద్యోగ కోతలు లేఆఫ్లు, సహజ విరమణలు, ఇతర చర్యల ద్వారా జరుగుతాయని నివేదిక వెల్లడించింది.2025 రెండో త్రైమాసికానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తూ ఇంటెల్ ఉద్యోగుల తొలగింపును ధృవీకరించింది. పునర్నిర్మాణ ఖర్చులతో సహా కంపెనీ 2.9 బిలియన్ డాలర్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ త్రైమాసికంలో ఆదాయం 12.9 బిలియన్ డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. ప్రస్తుత త్రైమాసికంలో సంస్థ ఆదాయం 12.6 బిలియన్ డాలర్ల నుంచి 13.6 బిలియన్ డాలర్ల మధ్య ఉంటుందని అంచనా వేస్తోంది.ఇంటెల్ సీఈవో లిప్-బు టాన్ ఉద్యోగులకు రాసిన లేఖలో సంస్థ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను ప్రస్తావించారు. గత కొన్ని నెలలుగా పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నాయన్నారు. సంస్థను క్రమబద్ధీకరించడానికి, సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రతి స్థాయిలో జవాబుదారీతనం పెంచడానికి కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# ప్రధాని మోదీకి మాల్దీవుల అధ్యక్షుడు

## మొహమ్మద్ మొయిజు ఘనంగా స్వాగతం

**హైదరాబాద్ జూలై 25 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ   విదేవీ పర్యటన లో భాగంగా ప్రధాని శుక్రవారం  మాల్దీవుల  పర్యటనకు వెళ్లారు. రెండు రోజులపాటూ (25-26) మాల్దీవ్స్లో మోదీ పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం మాలే చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజు   ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాలే ఎయిర్పోర్ట్లో వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు వినిపించాయి. అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ మొయిజు ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ మాల్దీవుల పర్యటనకు వెళ్లారు. ఆ దేశంలో మోదీ పర్యటించడం ఇది మూడోసారి. మొయిజు మాల్దీవులలో అధికారం చేపట్టిన తర్వాత ఒక విదేశీ దేశాధినేత తొలి పర్యటన ఇదే కావడం విశేషం.

# హెచ్-1బీ జారీలో కీలక మార్పులు




అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం హెచ్-1బీ వీసాల జారీ ప్రక్రియలో కీలక మార్పులకు సిద్ధమవుతున్నది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హౌమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఓ ప్రతిపాదనను శ్వేతసౌధంలోని ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్ ఫర్ రివ్యూ కార్యాలయానికి పంపింది. వాస్తవానికి ఎన్ని హెచ్-1బీ వీసాలు జారీ చేయాలనే చట్టపరమైన పరిమితిని ఏటా కాంగ్రెస్ నిర్ణయిస్తుంది. ప్రస్తుతం అది 85,000గా ఉంది. వీటిల్లో 20,000 వీసాలు మాస్టర్స్ డిగ్రీ ఉన్న వర్కర్ల కోసం రిజర్వు చేశారు. ఇక ఎటువంటి పరిమితి లేని వీసాలను విశ్వవిద్యాలయాల్లోని పరిశోధన విభాగాల కోసం జారీ చేస్తారు. 2026 కోసం వార్షిక పరిమితికి తగినన్ని దరఖాస్తులు రావడంతో ప్రాసెస్‌ను నిలిపివేసినట్టు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. దీంతో 2026 సంవత్సరానికి లాటరీ విధానం ఉండకపోవచ్చు. ప్రస్తుతం పరిమితి ఆధారంగా లాటరీ విధానంలో వీసా దారులను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ తర్వాత ఆయా కంపెనీలు తమకు వచ్చిన వీసాల్లో అక్టోబర్ నాటికి విధుల్లో చేరాల్సిన కార్మికుల దరఖాస్తులను సమర్పిస్తాయి. ట్రంప్ తొలివిడత అధికారంలోకి వచ్చాక.. లాటరీ విధానంలో కాకుండా.. సదరు పోస్టుకు ఆఫర్ చేస్తున్న వేతనం ఆధారంగా వీసాలు జారీ చేశారు. కంపెనీలు మరింత మంది ఉన్నత స్థాయి నిపుణులను నియమించుకొనేలా ప్రోత్సహించేందుకు ఈ విధానం అమలు చేసినట్టు తెలుస్తోంది. దీంతోపాటు తక్కువ శ్రేణి జీతాలున్న పొజిషన్లలో విదేశీయుల నియామకాలను నియంత్రిచేందుకు ఉపయోగపడింది. నాడు 'బై అమెరికన్, హైర్ అమెరికన్' అనే కార్యక్రమం కింద దీనిని నిర్వహించారు. 2021లో బైడెన్ అధికారంలోకి వచ్చాక దీనిని పక్కన పెట్టారు. ఇక తాజాగా డీహెచ్ఎస్ పంపిన ప్రతిపాదనపై దాదాపు 1,000 వరకు పబ్లిక్ కామెంట్లు వచ్చినట్టు బ్లూమ్‌బెర్గ్ రిపోర్ట్ చేసింది. దీని వల్ల హెచ్-1బీ ఉద్యోగులు తక్కువగా అందుబాటులో ఉంటారని పేర్కొంది.

# రష్యాలో భారీ భూకంపం

రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైంది. దీంతో రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పానికి, హవాయిలోని కొన్ని ప్రాంతాలకు పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం(పీటీడబ్ల్యూసీ).. సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత ప్రమాదమేమీ ఉండదని చెప్పింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచనలు జారీ చేశారు. భూకంప కేంద్రం పెట్రోపావ్లోవ్స్క్-కామ్చాట్కా నగరానికి తూర్పున 144 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహా సముద్రంలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీనికి ముందు దాదాపు గంట సమయంలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్టు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే(యూఎస్‌జీఎస్) తెలిపింది. వీటిల్లో 7.4 తీవ్రతతో కూడిన భూకంపంతో సునామీ వచ్చే అవకాశం ఉన్నట్టు హెచ్చరించింది.

# కోటి మంది శరణార్థులపై ప్రభావం

నిధులలో కోత కారణంగా కోటి మందికి పైగా శరణార్థులు మానవతా సహాయాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదమున్నదని ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ (యూఎన్‌హెచ్‌సీఆర్) హెచ్చరించింది. నిధుల కొరతకు సంబంధించి ఇది ఒక నివేదికను కూడా విడుదల చేసింది. ఈ ఏడాది నిర్దేశించిన నిధుల లక్ష్యం 10.6 బిలియన్ డాలర్లుగా ఉండగా.. ఇందులో 23 శాతమే అందిందని వివరించింది. నిధుల కోత ఫలితంగా ఈ ఏడాది చివరి నాటికి మొత్తం బడ్జెట్ 3.5 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంటుందనీ, అది 122 మిలియన్ల మంది శరణార్థులు, ప్రజల అవసరాలను తీర్చటానికి మాత్రమే సరిపోతుందని ఆ నివేదిక పేర్కొన్నది. నిధులను పొందే విషయంలో తాము క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నామని యూఎన్‌హెచ్‌సీఆర్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ డైరెక్టర్ డొమినిక్ హైడే తెలిపారు. 11.6 మిలియన్ల మంది శరణార్థులు, ప్రజలు యూఎన్‌హెచ్‌సీఆర్ కల్పించే మానవతా సాయాన్ని కోల్పోతారేమోన్న భయాందోళనలో తామున్నామని వివరించారు. అయితే ఏయే దేశాలు తాము అందించే నిధులలో కోత విధించాయన్న వివరాలను మాత్రం నివేదిక పేర్కొనలేదు. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత యూఎన్‌హెచ్‌సీఆర్‌కు అందించే నిధుల్లో కోత విధించారు. గతేడాది ఈ ఏజెన్సీకి అందిన నిధుల్లో 40 శాతం, అంటే రెండు బిలియన్ డాలర్లకు పైగా యూఎస్ నుంచే సమకూరింది. అయితే ఈ సారి మాత్రం ఆ నిధులలో యూఎస్ కోతను విధించింది. ఈ నేపథ్యంలో యూఎన్‌హెచ్‌సీఆర్ నివేదిక రావటం గమనార్హం. సూడాన్, మయన్మార్, అఫ్ఘనిస్తాన్ వంటి అనేక దేశాల్లో దాదాపు 1.4 బిలియన్ డాలర్ల విలువైన సహాయ కార్యక్రమాలను నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని యూఎన్‌హెచ్‌సీఆర్ వివరించింది.

# మాతా వైష్ణో దేవి యాత్ర మార్గంలో
## విరిగిపడిన కొండచరియలు..



జమ్మూ కాశ్మీర్: జమ్మూ కాశ్మీర్‌లో సోమవారం తెల్లవారుజామున కుండపోత వర్షాల కారణంగా కత్రాలోని మాతా వైష్ణో దేవి యాత్ర మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. యాత్ర ప్రారంభ ప్రదేశం బంగంగా ప్రాంతానికి సమీపంలో ఉదయం 8 గంటల సమయంలో కొండచరియలు విరిగిపడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో పలువురు యాత్రికులు గాయపడ్డారు. కాట్రా నుండి భవన్ వరకు పాత యాత్ర మార్గంలో ఉన్న బంగంగా ప్రాంతంలోని పర్వతం నుండి అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడటంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పుణ్యక్షేత్ర బోర్డు సిబ్బంది, పోలీసు సిబ్బందితో సహా రెస్క్యూ బృందాలు సమాచారం అందిన వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించి యాత్రికులను సురక్షితంగా తరలించారు. గాయపడిన యాత్రికులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. యాత్ర ట్రాక్ వెంట నిర్మించిన షెల్టర్లు కూడా కొండచరియలు విరిగిపడటం వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయని.. అదృష్టవశాత్తూ, రెస్క్యూ బృందాల సకాలంలో రావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షుల తెలిపారు. ఈ మార్గం పుణ్యక్షేత్రాన్ని సందర్శించే యాత్రికులు ఉపయోగించే పురాతన, అత్యంత తరచుగా ఉపయోగించే మార్గాలలో ఒకటి. దీని ద్వారా ప్రతిరోజూ వేలాది మంది నడుస్తారు. ఈ సంఘటన తర్వాత ఆ మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.

## గంజాయికి బానిసై.. రూ.20 కోసం అమ్మనే గొడ్డలితో నరికి చంపాడు

నుహ్(హర్యానా): గంజాయికి బానిసైన ఓ వ్యక్తి.. రూ.20 కోసం కన్న తల్లినే దారుణంగా గొడ్డలితో నరికి చంపాడు. ఈ దిగ్భ్రాంతికరమైన సంఘటన హర్యానాలోని నుహ్ జిల్లాలోని జైసింగ్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. రూ.20 ఇవ్వడానికి నిరాకరించడంతో 56 ఏళ్ల మహిళను ఆమె కొడుకు నరికి చంపాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. కొడుకు మాదకద్రవ్యాలకు బానిసై చాలా కాలంగా గంజాయి, నల్లమందు సేవిస్తున్నాడు. ఈ క్రమంలో నిందితుడు జంషెడ్ తన తల్లి రజియాను రూ.20 అడగగా.. ఆమె డబ్బు ఇవ్వడానికి నిరాకరించింది. దీనితో ఆగ్రహించిన అతను తన తల్లిని గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తల్లి చనిపోయిన తర్వాత జంషెడ్ మృతదేహం ఉన్న ఇంట్లోనే రాత్రంతా గడిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. అనంతరం రజియా మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు. నాలుగు నెలల క్రితమే రజియా భర్త ముబారక్ మరణించాడని పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

# మైనింగ్ ప్రాజెక్ట్ వద్దు
## ఈక్వెడార్‌లో రైతుల ఆందోళనలు

దక్షిణ అమెరికా దేశమైన ఈక్వెడార్‌లోని లాస్ నావేస్‌లో రైతులు మైనింగ్ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ గత వారం నుంచి ఆందోళనలు చేస్తున్నారు. దీని వల్ల తమ జీవనోపాధి పోతుందనీ, నీటి వనరులు కోల్పోతామని వారు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాజెక్ట్ చేపట్టిన సంస్థ దేశాధ్యక్షుడు డానియల్ నొబోవా కుటుంబ సభ్యులకు చెందిందనీ, అందుకే నిరసనలను అణిచేస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. లాస్ నావేస్ ప్రాంతంలో బంగారం, వెండి, జింక్ వంటి విలువైన ఖనిజాలను గుర్తించారు. దీన్ని ఎల్ డోమో గని అంటారు. వీటిని వెలికితీసే ప్రాజెక్ట్‌ను క్యూరీమైనింగ్ సంస్థ చేపట్టింది. అయితే దీనితో తమ వ్యవసాయం, పసుసంపద, నీటి వనరులు దెబ్బతింటాయని రైతులు, గ్రామీణ ప్రజలు గతకొంతకాలంగా ఉద్యమిస్తున్నారు. శనివారం నాడు స్థానికులకు పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. నొబోవా ప్రభుత్వం నిరసనకారుల శిబిరాలను తొలగించిందని, వందలాది మందిని అరెస్ట్ చేసిందని, అనేకమంది గాయపడ్డారని ఆ దేశ మీడియా వెల్లడించింది. రాజకీయ విశ్లేషకురాలు, వామపక్ష కార్యకర్త అయిన పామెలా విటెరీ ఈ గని ప్రాజెక్ట్‌తో రైతులు తీవ్రంగా నష్టపోతారనీ, దీని వెనకాల ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని, పోలీసుల ద్వారా నిరసనలను అణిచేసి వనరులు దోచుకోవడానికి కంపెని చూస్తుందని విమర్శించారు. మౌనంగా ఉంటే కార్పోరేట్ కంపెనీలు దేశాన్ని దోచుకుంటాయనీ, ఈ పోరాటం ఇక్కడికే పరిమితం కాదని పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# వియత్నాంలో బోటు బోల్తా



యత్నాంలో ఘోర ప్రమాదం జరిగింది. పర్యాటకుల బోటు బోల్తా పడటంతో 37 మంది మరణించినట్టు స్థానిక మీడియా ఆదివారం వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం .. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఉత్తర వియత్నాంలోని క్వాంగ్ నిన్హ్ ప్రావిన్స్‌లోని హాలాంగ్ బే వెళు తుండగా అకస్మాత్తుగా ఉరుములతో భారీ వర్షం కురిసింది. దీంతో బోటు బోల్తాపడినట్టు వియత్నాం మీడియా తెలిపింది. ఆ సమయంలో బోటులో 48 పర్యాటకులతో పాటు ఐదుగురు సిబ్బంది ఉన్నారు. 47 మందిలో పది మందిని రక్షించగా, 37 మంది మరణించినట్టు తెలిపింది. మృతుల్లో 20 మందికి పైగా చిన్నారులు ఉన్నట్టు పేర్కొంది. నలుగురు బాధితులను గుర్తించాల్సి వుందని తెలిపింది. ప్రయాణికుల్లో అధిక భాగం హనోయి నుంచి వచ్చినట్టు సమాచారం. జులై 20 (ఆదివారం) తెల్లవారుజామున విన్హ్‌జాన్హ్ 58 పర్యాటక బోటును ఒడ్డుకు తీసుకువచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ చిన్ అత్యవసర ప్రకటన జారీ చేశారు. రక్షణ శాఖ, ప్రజా భద్రతా శాఖ మరియు ఇతర సంబంధిత మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీలు, స్థానిక అధికారుల సమన్వయంతో సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు.

## పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడినవాళ్లు ఎక్కడున్నారు

ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ వర్షకాల సమావేశాల్లో గందరగోళం నెలకొంది. లోక్ సభ, రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇండియా కూటమి, విపక్షాలు ఆందోళనకు దిగాయి. రాజ్యసభలో పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్?పై చర్చించాలని పట్టుబట్టాయి. దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, ఎంపి మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడికి ఇంటెలిజెన్స్ వైఫల్యమే కారణమని జమ్మూ గవర్నర్ చెప్పారన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడినవాళ్లు ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు. భారత ఫైటర్ జెట్ల కూల్చివేతపై సమాధానం ఇవ్వాలని.. సీజ్?ఫైర్?కు కారణమెవరని నిలదీశారు. నేనే యుద్ధం ఆపానంటూ అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ 20 సార్లు చెప్పుకున్నారని.. దీనిపై కేంద్రం సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఇక, లోక్ సభలోనూ గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆపరేషన్ సిందూర్?పై చర్చకు పట్టుబట్టిన విపక్షాల సభ్యులు.. స్పీకర్ పోడియం దగ్గరకు వెళ్లి నిరసనకు దిగారు. దీంతో లోక్?సభను మధ్యాహ్నం 2 గంటలకి స్పీకర్ వాయిదా వేశారు.

## 22 నిమిషాల్లోనే పాక్ ఉగ్ర స్థావరాలను భూ స్థాపితం చేశాం



22 నిమిషాల్లోనే పాక్‌లో ఉగ్రస్థావరాలను మట్టుబెట్టామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాలం సమావేశాలు ప్రారంభం సందర్భంగా.. పార్లమెంటు ప్రాంగణంలో ప్రధాని మాట్లాడారు. తొలిసారి ఆపరేషన్ సిందూర్ గురించి పలు విషయాలను పంచుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా.. పాకిస్థాన్ ఉగ్రస్థావరాలను మన ఆర్మీ భూ స్థాపితం చేసిందని చెప్పారు. మేడిన్ ఇండియా ఆయుధాలతో ఆపరేషన్ సిందూర్ నిర్వహించామని.. ఆ ఆయుధాలు వాటి సత్తా నిరూపించుకున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా ప్రపంచానికి తెలిసిందని.. భారత సైనిక బలాన్ని ప్రపంచ దేశాలు ప్రత్యక్షంగా చూసాయని తెలిపారు. మావోయిస్టు ముక్త్ భారత్?లో ముందడుగు వేశామని, దేశంలో మావోయిజం దాదాపుగా అంతమైందని ప్రదాని చెప్పారు. అనేక ప్రాంతాలను మావోయిస్టుల నీడ నుంచి బయటకు తీసుకొచ్చామని.. వందలాది జిల్లాలు నక్సల్ ఫ్రీ జోన్లుగా మారిపోయాయని ఆయన తెలిపారు. రెడ్ కారిడార్లు గ్రీన్ జోన్లుగా మారుతున్నాని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వర్షాలు బాగా పడుతున్నాయని.. వర్షాల వల్ల రైతులకు ఎంతో లాభదాయకమని మోడీ అన్నారు. రైతుల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ఈ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని కోరుకుంటున్నానన్నారు. ఇక, యాక్సియం-4 మిషన్?పై ప్రధాని మోడీ ప్రశంసలు కురిపించారు. అంతరిక్షంలో భారత్ కొత్త చరిత్ర సృష్టించిందని ప్రధాని మోడీ అన్నారు.

# 2006 ముంబై రైలు పేలుళ్ల కేసు..
## 12 మందిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు

ముంబై: 2006 ముంబై రైలు పేలుళ్ల కేసులో 12 మంది నిందితులను నిర్దోషులుగా సోమవారం బాంబే హైకోర్టు ప్రకటించింది. జస్టిస్ అనిల్ కిలోర్, శ్యామ్ చందక్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం సోమవారం ఉదయం సంచలన తీర్పు వెలువరించింది. నిందితులపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని పేర్కొంది. గతంలో విధించిన మరణశిక్షలు, జీవిత ఖైదులను సమర్థించడానికి నిరాకరించిన న్యాయస్థానం.. వారికి విధించిన శిక్షలను రద్దు చేసింది. కాగా, జూలై 11, 2006న రద్దీ సమయంలో పశ్చిమ రైల్వే లైన్‌లోని ముంబై సబర్బన్ రైళ్లలో ఏడు బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ వరుస బాంబు దాడుల్లో 189 మంది మృతి చెందగా.. 800 మందికి పైగా గాయపడ్డాయి. ఫస్ట్-క్లాస్ కంపార్ట్‌మెంట్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రెషర్ కుక్కర్ కంటైనర్లలో బాంబులు పెట్టి పేల్చిన సంఘటనలు ముంబై నగరాన్ని తీవ్ర భయాందళనకు గురిచేశాయి. ఈ బాంబు దాడుల్లో పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. 2015లో ప్రత్యేక కోర్టు ఈ కేసులో 12 మందిని దోషులుగా నిర్ధారించింది. వారిలో ఐదుగురికి మరణశిక్ష విధించగా.. మిగిలిన ఏడుగురికి జీవిత ఖైదు విధించింది. తర్వాత దోషులు తమ శిక్షలపై న్యాయస్థానంలో అప్పీల్ చేసుకున్నారు. తాజాగా ఈ కేసులో బాంబే హైకోర్టు 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెల్లడించింది.

## స్కాలర్షిప్,మెస్,బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని

### - ఏబీవీపీ జిల్లా ఆధ్వర్యములో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 25 :** పెండింగ్ లో ఉన్న మెస్ బకాయిలు మరియు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ఏబీవీపీ ఇందూరు జిల్లా కన్వీనర్ బాలకృష్ణ మాట్లాడుతూ.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 8300 కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ,ముఖ్యంగా చదువుకొనే పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన డిగ్రీ మరియు పీజీ విద్యార్థులు,స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేకపోవడం నిజంగా బాధాకరం.పేరుకేమో ప్రభుత్వ కళాశాల కానీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ మరియు మెస్ బకాయిలు రాక వాళ్ల చేతుల్లో నుండి డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి .విద్యార్థులకు స్కాలర్షిప్ అనేది ప్రభుత్వ బిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని అన్నారు. రాష్ట్రంలోని వేలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు స్కాలర్షిప్ లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారుగా 5 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం తో విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. స్కాలర్షిప్ అందని కారణంగా విద్యార్థులు ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్లు (టీ సిలు), మెమోలు తీసుకోలేక, వారి పై చదువులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని వారు తెలియజేశారు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థుల వద్ద కొన్ని కార్పొరేట్ కళాశాలలు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పరిస్థితిని అరికట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను మరియు మెస్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటేశ్వర జోనల్ ఇంచార్జ్ దుర్గా దాస్ ,మహేష్ ,ప్రణీత్, సిద్దు ,ప్రేమ్ ,శ్రీనివాస్, మహేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి

### - వైద్యులు సమయ పాలన పాటించాలి

### - జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జూలై 25 :** వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.శుక్రవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకొని, వర్షాకాలంలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ కు వచ్చే జ్వర పిడుతులకు ఏ ఏ పరీక్షలు చేస్తున్నారని, మందుల నిల్వలు సరిపడే విధంగా ఉన్నాయ అని, వివరాలు అడుగగా, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్. శ్రవణ్ కుమార్ జ్వరంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికి మలేరియా డెంగ్యూ ఆర్డిటి పరీక్షలు చేస్తున్నామని, దానితోపాటు దోమల నియంత్రణ చర్యలపై కూడా అవగాహన కల్పిస్తున్నామని, పెద్దవారికి టాబ్లెట్స్, చిన్నపిల్లలకు పౌడర్ రూపంలో ఉన్న మందులను చికిత్సగా ఇస్తున్నామని తెలిపారు.అనంతరం ఆయుష్ సెంటర్ను సందర్శించి ఎటువంటి సమస్యలతో ఆయుష్ సెంటర్కు ప్రజలు వస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకోగా, చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు, అనోరెక్టల్, సాధారణ జబ్బులతో ఎక్కువ వస్తున్నారని వారికి చికిత్సలు జేస్తున్నామని తెలిపారు. ఆశా కార్యకర్తలు ఫీవర్ సర్వే చేయాలని ప్రతిరోజు 20 ఇంటింటి సందర్శన భావించాలని దోమల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆయుష్ డాక్టర్ సంధ్య ఫార్మసిస్ట్ ఉషారాణి, ఆరోగ్య కార్యకర్తలు మంజుల, వసంత, ఆశా కార్యకర్తలు సుధారాణి, రేణుక, రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### - రెండో విడతలో స్థలం లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

### - నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

### - డిచ్ పల్లి లో రేషన్ కార్డులను పంపిణీ చేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 25 :** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో ఇచ్చిన మాట తప్పకుండా అన్ని సంక్షేమ పథకాలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని,నిరుపేదల కలలను నెరవేస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి అన్నారు.డిచ్పల్లి మండల కేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్లో ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్రంలో ఈనెల 14న సీఎం రేవంత్ రెడ్డి నూతన రేషన్ కార్డును పంపిణీ ప్రారంభించారని, ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు కావలసిన ప్రతి సంక్షేమం పథకలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తోందని అన్నారు. మన జిల్లాలో 63,500 కొత్త కార్డులు, రూరల్ నియోజకవర్గంలో నూతన రేషన్ కార్డులు 16,116 మంజూరు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో నిరుపేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని, కెసిఆర్ మనుమడు ఎ బియ్యం తింటున్నాడో పేదలకు కూడా సన్న బియ్యం ఇస్తామని కెసిఆర్ చెప్పిన మాటలు అన్ని అబద్ధాలు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలకు, విద్యార్థులకు సన్నబియ్యం ఇస్తుందని ప్రతి ఒక్కరికి సన్న బియ్యం ఇయ్యాలని, ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలకు అన్ని రకాలుగా ఆదుకుంటుందని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఎక్కడ ఇవ్వలేదని విమర్శించారు. రూరల్ నిజామాబాద్ నియోజకవర్గంలో సుమారు 22 వేల ఇండ్లు అవసరం ఉన్నదని వాటన్నింటినీ కట్టించే బాధ్యత నాదని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. రెండో విడతలు ఇళ్లస్థలం లేనివారికి 75 గజాల స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. దేశంలోనే పేదలకు సన్నబియ్యం ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిది, కాంగ్రెస్ పార్టీదని అన్నారు, రైతు భరోసా ,బోనస్ వంటి సంక్షేమ పథకాల ద్వారా రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం అని అన్నారు. బిజెపి పాలిస్తున్న రాష్ట్రాలలో ఎక్కడ కూడా సన్న బియ్యం పేదలకు ఇస్తలేరని విమర్శించారు. కర్ణాటక ముఖ్యమంత్రి కామారెడ్డి డిక్లరేషన్లో బీసీలకు పెద్దపీట వేస్తామని అన్నారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42% రిజర్వేషన్ దేశానికి రోల్ మోడల్ గా అయిందని, సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల మొగ్గు చూపుతున్నారని, గత ప్రభుత్వం బీసీలకు 30% ఉంటే 27% తగ్గించిందని, కాంగ్రెస్ పార్టీ అధికారులకు వచ్చిన తర్వాత బీసీ కులగన చేసి 42 శాతం రిజర్వ్ రిజర్వేషన్ ఇవ్వాలని శాసనసభలో బిల్లు పెట్టి చట్టబద్ధ కల్పించి, కేబినెట్ మీటింగ్లో ఆర్డినెన్స్ తేవడం జరిగిందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్క హామీ నెరవేరుస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఒక్క హామీ నెరవేరుతుందని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత కరెంటు, రైతు భరోసా రైతు, రుణమాఫీ, ఉచిత సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, అనేక సంక్షేమ పథకాలు అమలు అమలు చేస్తుందని అన్నారు.స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం అని అన్నారు.గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఎన్నో అక్రమాలకు పాల్పడిందని అవన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని అన్నారు. కేటీఆర్ మతి లేకుండా మాట్లాడుతున్నారని, కెసిఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు.ఈ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్డీవో రాజేంద్ర కుమార్,తహసీల్దార్ సతీష్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి యోహాన్, పీసీసీ జనరల్ సెక్రటరీ నాగేష్ రెడ్డి పి సిసి డెలికేట్ శేఖర్ గౌడ్, ఐ సి డి ఎం ఎస్ చైర్మన్ తారాచంద్, ఎన్ డి సి సి వైస్ చైర్మన్ నల్ల చంద్ర శేఖర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, డీసీసీ డెలికెట్ ధర్మగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్యామ్ సన్, వాసు బాబు కాంగ్రెస్ మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, నవీన్ గౌడ్, పి ఏ సి ఎస్ చైర్మన్ రాంచందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఉమ్మాజీ నరేష్, రెవిన్యూ అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పరిపాలన అధికారి, లైసెన్స్డ్ సర్వేయర్ రాత పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలి

### - అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి.




**ములుగు ప్రతినిధి(మన వెలుగు) జూలై 25 :** ఈ నెల 27న నిర్వహించనున్న గ్రామ పరిపాలన అధికారి, లైసెన్స్డ్ సర్వేయర్ స్క్రీనింగ్ రాత పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి. అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఈ నెల 27వ తేదిన జరుగనున్న గ్రామ పరిపాలన అధికారి, లైసెన్స్డ్ పరీక్షలు నిర్వహణపై రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతి రాజ్ శాఖల అధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి పరీక్షను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని, 26 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాస్తున్నారని తెలిపారు.అలాగే లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్ష జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో వ్రాత, ప్రాక్టీకల్ పరీక్షలు అదే రోజు ఉదయం 10.00 %గాహీ శీ 1.00గావీ%, సాయంత్రం 2.00 %గాహీ శీ 5.00గావీ%నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాస్తున్నారని తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచియుండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.పరీక్ష నిర్వహణలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.ప్రశ్న, జవాబు పత్రాలను పోలీస్ భద్రత నడుమ తరలించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.
మంచినీరు సరఫరా చేయాలని, మున్సిపల్, అధికారులు పరీక్షా కేంద్రాల్లో వ్యర్థాలు లేకుండా పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. సిబ్బంది, పరీక్ష వ్రాసే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లు, వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యూలేటర్స్ తీసుకెళ్లడానికి అనుమతి లేదని, నిశిత పరిశీలన తదుపరి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించాలని తెలిపారు. తనిఖీ చేసే అధికారులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్స్ తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా పకడ్బంధిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం, %గూగా% ములుగు, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, సూపరింటెండెంట్ శివకుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో ఆటపాటలతో విద్యను బోధించాలి

### - జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జూలై 25 :** జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నూతన సిలబస్ ప్రకారం ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.శుక్రవారం ములుగు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ లోని మల్లంపల్లి అంగన్ వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడి లో తల్లులతో మాట్లాడారు. పిల్లలు ఇక్కడే భోజనం చేస్తున్నారా , లేదా ఆరా తీశారు. సామ్ పిల్లలు, మ్యామ్ పిల్లల గ్రోత్ ఎలా ఉందని, ఏ ఫుడ్ ఇస్తున్నారు, బాలమృతం ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.పిల్లలను ప్రతి ఒక్కరూ అంగన్వాడి కేంద్రానికి పంపాలని సూచించారు. కిచెన్ షేడ్ ను, స్వయంగా తనిఖీ చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యను బోధించాలని, వారితో మమేకమై గేయాలు పాడించలన్నారు.అన్ని అంగన్వాడి కేంద్రాలలో నెలవారి సిలబస్ ను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం వేడివేడిగా ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా పిల్లల బరువు, ఎత్తు తూచాలని, బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి సాధారణ బరువు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలకు ఇవ్వాల్సిన పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అతిగా బరువు తక్కువ ఉన్న పిల్లలను ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి రిఫర్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ టి. రవి, సిడిపిఓకే. శిరీష, సూపర్వైజర్ ఖమురునిసా బేగం, అంగన్వాడి టీచర్లు మల్లికాంబ, ప్రియాంక, అంగన్వాడి పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు

### - సాలూర,బోధన్ లో రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే,కలెక్టర్



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 25 :** అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందజేస్తామని బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని సాలూర, బోధన్ మండల కేంద్రాలలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సాలూరలో టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ మండలానికి చెందిన 108 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందజేశారు. బోధన్ లో లయన్స్ ఆసుపత్రి మీటింగ్ హాల్ లో బోధన్ మండలానికి చెందిన 665 కుటుంబాలకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 2.50 లక్షల రేషన్ కార్డులు మాత్రమే అందించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఏడాదిన్నర వ్యవధిలోనే 6 లక్షల పైచిలుకు కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇంకనూ అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందిస్తామని అన్నారు. అయితే అర్హులైన వారికే కార్డులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారితో సమానంగా నిరుపేదలు కూడా సన్న బియ్యంతో కూడిన భోజనం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని భరిస్తూ అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. పేదల అభ్యున్నతి కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని, సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, ఐకేపీ, మెప్మా ద్వారా లక్ష రూపాయల వరకు రుణాలు కూడా అందిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేద కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యా బోధనతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందని తెలిపారు. ముఖ్యంగా నీటి వసతి, బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్స్ నిర్మాణానికి రూ. 22 కోట్ల నిధులు వెచ్చిస్తున్నామని వివరించారు. రైతులకు కూడా ప్రభుత్వం ఇతోధికంగా మేలు చేకూరుస్తోందని అన్నారు. రైతులు సంప్రదాయంగా వస్తున్న వరి సాగుకు బదులుగా అధిక లాభాలు అందించే ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మండలాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 11,852 కొత్త రేషన్ కార్డులతో పాటు 84,232 మంది కొత్త సభ్యుల పేర్లను రేషన్ జాబితాలో చేర్చడం జరిగిందన్నారు.రేషన్ కార్డులు కలిగి ఉన్న వారందరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.దీంతో రేషన్ కార్డులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని వెల్లడించిన కలెక్టర్, అర్హులైన వారు ఇంకనూ మిగిలి ఉంటే ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, అదే సమయంలో అనర్హులకు కార్డులు రాకుండా పకడ్బందీగా వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలని హితవు పలికారు. ఆయా దశలను అనుసరిస్తూ వెంటదివెంట బిల్లులను వారి ఖాతాలలో జమ చేస్తున్నామని, ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా, లక్ష రూపాయల రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు.అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. లీకేజీలు, ఫ్లోరింగ్ వంటి వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## రైతుల అవసరాలకు సరిపడా అందుబాటులో యూరియా ఎరువులు

**- ఎరువుల గిడ్డంగి ఆకస్మికంగా తనిఖీ.**

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 25 :** జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలుకరించి, సరిపడా ఎరువులు అందుతున్నాయా అని ఆరా తీశారు. జిల్లాలో ఇంకనూ 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రెండు రోజులకు ఒకసారి ఎరువుల స్టాక్ జిల్లాకు వస్తోందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరత తలెత్తకుండా పర్యవేక్షణ చేస్తున్నామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా రైతులు కూడా తమకు పూర్తి స్థాయిలో ఎరువులు లభిస్తున్నాయని, ఎలాంటి కొరత లేదని సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, రైతులు వరికి ప్రత్యామ్నాయంగా అధిక లాభాలను అందించే ఆయిల్ పామ్ పంట సాగు వైపు దృష్టి సారించాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## అంగన్వాడీ సెంటర్ లో చిన్నారులకు అన్న ప్రాసన,అక్షరాభ్యాసం

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 25 :** మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండలం గుండం రాజుపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో కమ్యూనిటీ బేస్ట్ ఈవెంట్స్ లో భాగంగా శుక్రవారం చిన్నారులకు అన్న ప్రాసన,అక్షరాభ్యాసం,గర్భిణీ స్త్రీ,కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా ఐసిడిసి సూపర్వైజర్ శ్రీలత మాట్లడుతుమొదటి ఆరు నెలల పాటు తల్లిపాల ప్రాముఖ్యత,బిడ్డకు ఆరు నెలలు నిండిన తరువాత అనుబంధ ఆహార అవసరం పై తల్లులు గర్భిణీలకు అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు జ్యోతి, సంధ్యారాణి,సుమలత,ఆయాలు,అనిత,సంధ్య,చిన్నారుల తల్లి దండ్రులు,తదితరులు పాల్గొన్నారు




## మహిళలకు,పిల్లలకు అండగా భరోసా కేంద్రం

**- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వెల్లడి**




**నిజామాబాద్ ప్రతినిధి (మనవెలుగు) జూలై 25:** నిజామాబాద్ పోలీస్ కార్యాలయం లో భరోసా కేంద్రంలో నమోదైన పోక్సో మరియు రేప్ కేసులలో ఏడు మంది బాధిత పిల్లలకు,మహిళలకు భరోసా కేంద్రంతరపున చెక్కులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య,చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా మహిళలకు మనో-ధైర్యం,న్యాయం అందించడం పోలీస్ శాఖ యొక్క ముఖ్య లక్ష్యాలలో ఒకటి.ఈ రోజు బాధిత మహిళలకు మరియు పిల్లలకు ఆర్థిక సాయం కోసం భరోసా కేంద్రం తరపున చెక్కులు అందజేయడం ద్వారా వారి పునర్వాసానికి మనదైన తోడ్పాటు అందించినందుకు సంతృప్తిగా ఉంది. ప్రతీ మహిళాలు మరియు పిల్లలు భద్రతగా, గౌరవంగా జీవించాలన్నదే మా అభిలాష భరోసా కేంద్రం సేవలను మరింత విస్తరించి,బాధి-తుల కోసం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాం అని తెలియజేశారు.ఈ సందర్భంగా నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్ జి. రోజా,లీగల్ అడ్వయిజర్ దయాణ గీతిక మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ పుష్పావతి,మౌనిక,సవిత, ఎ.ఎన్.ఎమ్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే తప్పుల తడక

**- 52 శాతమున్న బీసీల జనాభా 46 శాతానికి ఎలా తగ్గింది**

**- కాంగ్రెస్ చెప్పుకునే రేర్ డేటా నిజమైతే తక్షణమే కుల సర్వే వివరాలు బయటపెట్టండి**

**- దమ్ముంటే గ్రామ పంచాయతీల వారీగా కుల సర్వే వివరాలను బహిర్గతం చేయాలి**

**- రాహుల్ గాంధీ,సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సవాల్**




**నిజామాబాద్ ప్రతినిధి (మనవెలుగు) జూలై 25:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే తప్పుల తడకగా ఉందని, దాన్ని కాంగ్రెస్ పార్టీ సమాజపు ఎక్స్ రే గా అభివర్ణించడాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా తప్పుబట్టారు. "అది ఎక్స్ రే కాదు.... కనీసం సీటీ స్కాన్ కూడా కాదు" అని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ పార్టీ చెబుతున్న రేర్ డేటా నిజమైతే తక్షణమే దాన్ని బయటపెట్టాలని, గ్రామ పంచాయతీల వారీగా, కులాల వారీగా కుల సర్వే వివరాలను బహిర్గతం చేయాలని రాహుల్ గాంధీకి, సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత సవాలు విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని ధ్వజమెత్తారు.కుల సర్వే పారదర్శకంగా జరగలేదని, అందులో ఎన్నో లోపాలున్నాయని ఎండగట్టారు.2014లో 52 శాతమున్న బీసీల జనాభా 2024కు వచ్చే సరికి 46 శాతానికి ఎలా తగ్గిందని ప్రశ్నించారు.దీన్ని బట్టే ప్రభుత్వం చేసిన కుల సర్వేకు విలువ లేదని తేలిపోయిందని స్పష్టం చేశారు.కాబట్టి గ్రామాల వారీగా వివరాలు బయటపెడితే దూద్ కా దూద్.పానీ కా పానీ తేలిపోతుందని తెలిపారు.

**లియూరియా కోసం దేబరించడం కాదు... కేంద్రంతో కొట్లాడాలి :** యూరియా కొరతతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మీన మేషాలు లెక్కించడమేమిటని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు.యూరియా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని దేబిరించడం కాదని, రాష్ట్రానికి రావాల్సిన కోటాను కొట్లాడి సాధించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "యూరియా సరఫరా చేయలేని ప్రభుత్వం ఎందుకు? వానాకాలం పంట సీజన్ ఆరంభం నుంచే రైతులు అవస్థలు పడుతున్నా పట్టింపేది ?" అని ప్రశ్నించారు. పంట సీజన్ మొదలైన నెలన్నర తర్వాత వ్యవసాయ శాఖపై సమీక్ష చేసిన సీఎం దేశంలో రేవంత్ రెడ్డి ఒక్కరేనేమో అని విమర్శించారు. అయినా కూడా రైతుల కష్టాలు తీరలేదని, నిత్యం యూరియా కోసం ఆగచాట్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం నిర్లప్తత తోడు కావడంతో మన రైతులు పొలం పనులు వదిలేసి యూరియా కోసం పరుగులు తీస్తున్నారని తెలిపారు.

## ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**- అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా**




హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 25 : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి శుక్రవారం పారిశుద్ధ్య సిబ్బందికి, స్వయం సహాయక సంఘాల మహిళలకి నిర్వహించే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏదైనా సమస్య ఉన్న ప్రారంభ దశలోనే నిర్ధారించి, దానికి అనుకూలంగా మందులను అవసరమైన చికిత్సలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. వివిధ రకాల విభాగాల వైద్యులచే ఆరోగ్య శిబిరాలను ప్రతివారం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ ని సందర్శించి స్వయం సహాయక సంఘాల మహిళలని అభినందించారు. తర్వాత వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. పర్యావరణం కాపాడటం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టిఎస్ వివన్ త్రిలేశ్వరరావ్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి , మేడిపల్లి తాసిల్దార్ హసీనా, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభా శంకర్, డిప్యూటీ ఇంజనీర్ సాయినాథ్ గౌడ్, అసిస్టెంట్ ఇంజనీర్ వినిల్ గౌడ్, మేనేజర్లు క్రాంతి కుమార్, కిషోర్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఉమేష్, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇషా హాస్పిటల్ వైద్య సిబ్బంది, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం....




**పినపాక (మన వెలుగు) జూలై 25 :** అశ్వాపురం, జులై 25: ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం నిబద్ధత తో పనిచేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణ రైతు వేదిక నందు మండలానికి చెందిన అర్హులైన 216 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను, 25 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను, సుమారు రూ 9 లక్షల విలువ గల 16 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ ఈ పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. రేషన్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల సమాజంలోని బలహీన వర్గాల ప్రజల అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తద్వారా వారు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రేషన్ కార్డుల ద్వారా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ ప్రారంభించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మణిధర్, ఎంపీఓ ముత్యాల రావు, సీడీపీఓ రేవతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా బోనాల పండుగను జరుపుకోవాలి



**హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 24 :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోనాల పండుగల సందర్భంగా ఆలయ చైర్మన్లు, ఆర్గ నైజర్లతో సీఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గోవిందరెడ్డి మాట్లాడుతూ శాంతి యుతంగా బోనాల పండుగను జరుపుకోవాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, అదేవిదంగా ఫలహారం బండ్లు, తోట్టల తీసేవాళ్ళు ముందుగా పోలీస్ స్టేషన్ కు తెలియపరిస్తే తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- శానిటైజేషన్ ఇన్స్పెక్టర్**



**హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 24 :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీ పేస్టులో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటైజేషన్ ఇన్స్పెక్టర్ బి.ఎన్.రెడ్డి వార్డ్ సూపర్వైజర్ జంగా శ్రీనివాస్ తో కలిసి కాలనీ అధ్యక్షులు చిన్నం గణేష్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు మాట్లాడుతూ కాలనీ వాసులందరూ వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకపోతే వర్షాల కారణంగా ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. అనంతరం కాలనీలో ఉన్నటువంటి చెత్తను మున్సిపల్ సిబ్బందితో కలిసి ట్రాక్టర్లతో చెత్తను తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి బైరు మధు, కోశాధికారి పారుపల్లి సోమనరసింహ, సలహాదారులు సల్ల నరసింహ యాదవ్, దేవాలయ కమిటీ చైర్మన్ బైరుగొండ భూపాల్, నీటి శాఖ కాలనీ సభ్యులు బెల్లం పరమేష్,ఉప కోశాధికారి కర్ర బీరప్ప,పాము భాస్కర్,సోమయ్య,చిన్నం రాములు,మున్సిపల్ సిబ్బంది మురళి,మహేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


## చాపల వేట...మీ ఇంటికి శాపంగా మారొద్దు

**పినపాక (మనవెలుగు) జూలై 25 :** అశ్వాపురం : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, పొంగి పొర్లుతున్నాయని ఈ నేపథ్యంలో మండలం లో ఎవరు చాపల వేటకు వెళ్లోద్దని చాపల వేట మీ కుటుంబాలకు శాపంగా మారద్దని సిఐ సూచించారు...



# నేడు నిజామాబాద్ ఆర్టీసీ బస్ స్టేషన్ లో సంబురాలు

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 22 :** మహాలక్ష్మి పథకంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఆర్టీసీ లో 5.84 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మహిళలు ఉచిత ప్రయాణ విలువ రూ. 239.17 కోట్లను తెలంగాణ ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించడం జరిగిందని అన్నారు. ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 2023 డిసెంబర్ 9వ తేదీ నుండి విజయవంతంగా అమలవుతోందని గుర్తు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆదేశాల మేరకు బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు


తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
నిజామాబాద్ జిల్లా

| | | | |
|---|---|---|---|
| 1 | నిజామాబాద్ జిల్లా లో డిపోల సంఖ్య | : | 4 (నిజామాబాద్-1, నిజామాబాద్-2, ఆర్మూర్, బోధన్ ) |
| 2 | మొత్తం షెడ్యూల్స్ | : | 382 ( 208 + 174 అద్దె బస్సులు) |
| 3 | వాహనముల సంఖ్య | : | 398 (223 + 175 అద్దె బస్సులు) |
| 4 | ఉద్యోగుల సంఖ్య | : | 1375 |
| 5 | ప్రతి రోజు బస్సులు తిరుగు దూరం (కి.మీ. లక్షలలో) | : | 1.68 |
| 6 | ప్రస్తుత ఆదాయం రోజుకు (లక్షలలో) | : | రూ.97.41 |
| 7 | ప్రయాణీకుల సంఖ్య రోజుకు (లక్షలలో) | : | 1.73 |
| 8 | బస్సులు తిరుగు రూట్లు | : | 159 |

మహాలక్ష్మి పథకం

09.12.2023 నుండి 23.07.2025 వరకు మహాలక్ష్మి పథకం ద్వారా నిజామాబాద్ జిల్లాలో 5.84 కోట్ల మంది మహిళా ప్రయాణీకులు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో తెలంగాణ మహిళా ప్రయాణీకులకు ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత 23.07.2025 నాటికి ఈ పథకం వల్ల నిజామాబాద్ జిల్లా మహిళలకు 239.17 కోట్ల ఆదాయం ఆదా అయినది. సగటున ప్రతిరోజు 1.00 లక్షల మంది మహిళా ప్రయాణీకులు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్నారు. మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినీలు, ట్రాన్ జెండర్లు కూడా ఉచితంగా ప్రయాణించవచ్చును. 24.12.2024 రోజు నుండి ఎలక్ట్రికల్ ఎక్స్ ప్రెస్ బస్సులు ప్రారంభించబడినవి. వీటిలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించబడినది.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమల్లోకి వచ్చిన నుండి 23.07.2025 వరకు 200 కోట్ల మంది మహిళా ప్రయాణీకులు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. ఈ పథకం వల్ల మహిళలకు 6680 కోట్ల ఆదాయం ఆదా అయినది.

# భూ తగదాలతో తమ్ముడిని హతమార్చిన అన్న

**-రెండు సవత్సరాల నుండి భు వివాధం..పార తో దాడి చిక్సిత్స పోందుతు మృతి**

**-ములరాంపుర్ లో గ్రామంలో విషాదం...మృతుడీ భార్య పిర్యాదు మేరకు కేసు నమెదు**

**-సంఘటన స్థలాన్ని పరిశీలించిన మెట్ పల్లి సిఐ అనిల్ కుమార్**



**ఇబ్రహింపట్నం (మన వెలుగు) జులై 22 :** భూ తగదాలతో తమ్ముడిని హతమార్చిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని మూలరాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలిసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గూడ గంగాధర్ (43) పెద్దనాన్న కొడుకు అయిన గూడ రవి (36) అను వారికి గత రెండు సంవత్సరాలుగా 12 గంటల వ్యవసాయ భూమి విషయంలో తరుచు గొడవలు జరుగుతుండగా జున్ 09 రోజున సాయంత్రం సమయంలో గూడ గంగాధర్ అను వ్యక్తి అతని పొలంలో ఒడ్డులు చెక్కుతూ అతని హద్దు దాటి గూడ రవి యొక్క ఒడ్డును చెక్కుతుండగా అలా ఎందుకు చెప్తున్నావని నడవడానికి దారి ఉండదు అని అడిగినందుకు అతని చేతిలో గల పారతో గూడ రవి ని అన్న గుడ గంగాధర్ విచక్షణారహితంగా అతని మొహం పై , తలపై పారతో దాడి చేయగా రవిని చికిత్స నిమిత్తం మెట్ పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లిగ మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించి చిక్సిత్స అందించారు. దాడీ జరిగిన రోజున రవి భార్య గూడ రజిత ఫిర్యాదు మేరకు ఇబ్రహింపట్నం ఎస్ ఐ అనిల్ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. చికిత్స పోందుతున్న రవి సోమవారం మనోరమ హాస్పిటల్ నుండి నిజామాబాద్ లోని గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలిస్తుండగా సాయంత్రం సమయంలో మృతిచెందగా అతని భార్య రజిత ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసుకున్నారు.మంగళవారం దాడిజరిగిన సంఘటన స్థలాన్ని మెట్ పల్లి సీఐ వి అనిల్ కుమార్ , ఇబ్రహీంపట్నం ఎస్ ఐ అనిల్ పరిశీలించినారు.రవి మృతి తో గ్రామం లో విశాదం చాయలు నెలకున్నాయి.

# సగం బరువు దించేసుకున్న కింగ్డమ్



జూలై 31 విడుదల కానున్న కింగ్డమ్ బడ్జెట్ పరంగా చాలా పెద్ద ఒత్తిడిని ఎదురుకుంది. విజయ్ దేవరకొండ మార్కెట్ ని మించి వంద కోట్ల దాకా ఖర్చు పెట్టడం థియేట్రికల్ గా రిస్క్ అయ్యింది. ఎందుకంటే బ్లాక్ బస్టర్ టాక్ వస్తే ఓకే. లేదంటే లెక్కలు ప్రమాదంలో పడతాయి. కానీ అలాంటి టెన్షన్ లేకుండా ఓటిటి డీల్ యాభై కోట్లకు క్లోజ్ అయ్యిందని లేటెస్ట్ అప్డేట్. హక్కులు కొన్న నెట్ ఫ్లిక్స్ నాలుగు వారాల విండో కింద ఇంత మొత్తానికి అంగీకారం తెలిపినట్టు వినికిడి. ఇది ఎప్పుడో జరిగిన ఒప్పందమే అయినా తాజాగా వచ్చిన లీక్స్ ప్రకారం చూసుకుంటే రౌడీ బాయ్ మార్కెట్ కు ఇది పెద్ద మొత్తమనే చెప్పాలి. కింగ్డమ్ కు ఇంత క్రేజ్ రావడం వెనుక కారణాలున్నాయి. ఇది రెగ్యులర్ కమర్షియల్ మూవీ కాదు. పీరియాడిక్ సెటప్ లో శ్రీలంక శరణార్థుల బ్యాక్ డ్రాప్ ని తీసుకుని దర్శకుడు గౌతమ్ తిన్ననూరి చాలా ఇంటెన్స్ గా తెరకెక్కించాడు. పైకి యాక్షన్ డ్రామాలా కనిపిస్తున్నా బలమైన బ్రదర్ సెంటిమెంట్ టచ్ చేసేలా ఉంటుందని యూనిట్ వర్గాల మాట. దీనికి తోడు అనిరుద్ రవిచందర్ సంగీతం రక్షణ కవచంలా నిలబడి యూత్ లో క్రేజ్ పెంచుతోంది. ఏ స్థాయి మ్యూజిక్ ఇచ్చాడనేది థియేటర్లలో తెలుస్తుంది కానీ సినిమా మీద బజ్ పెరిగేందుకు తన పేరు బయట రాష్ట్రాల్లో ట్రంప్ కార్డు అయ్యిందనేది వాస్తవం. ఇక మిగిలిన యాభై కోట్లను కింగ్డమ్ థియేటర్ల నుంచి వసూలు చేయాల్సి ఉంటుంది. కాకపోతే రెండు వారాల్లో ఆ టార్గెట్ పూర్తి చేయాలి. ఎందుకంటే కింగ్డమ్ వచ్చిన సరిగ్గా పధ్నాలుగు రోజులకు కూలి, వార్ 2 లు బాక్సాఫీస్ మీద అటాక్ చేస్తాయి. అప్పటికంతా విజయ్ దేవరకొండ తన లక్ష్యాన్ని చేరుకుంటే రిలాక్స్ అవ్వొచ్చు.

# బ్లాక్‌బస్టర్ సీక్వెల్.. పక్కానే కానీ



బాలీవుడ్లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్లలో 'భజరంగి భాయిజాన్' ఒకటి. 'బాహుబలి' రిలీజైన కొన్ని వారాలకే విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాన్నందుకుంది. బాలీవుడ్లో రూ.500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిన తొలి చిత్రంగా నిలిచింది. సల్మాన్ ఖాన్ కెరీర్లో కంటెంట్ పరంగా కూడా బెస్ట్ మూవీస్‌లో ఒకటిగా దీన్ని చెప్పొచ్చు. ఈ సినిమాకు సీక్వెల్ తీయడం గురించి ఎప్పట్నుంచో చర్చ జరుగుతోంది. ఈ మూవీకి కథ అందించిన విజయేంద్ర ప్రసాదే.. సీక్వెల్ కోసం ఒక లైన్ రెడీ చేశారు. దాన్ని గతంలో సల్మాన్ ఖాన్‌కు చెబితే.. ఆయన ఆసక్తి ప్రదర్శించారని కూడా అన్నారు. కానీ తర్వాత ఏమైందో తెలియదు.ఐతే ఇప్పుడు దర్శకుడు కబీర్ ఖాన్ 'భజరంగి భాయిజాన్' సీక్వెల్ గురించి మాట్లాడాడు. ఆ సినిమా కచ్చితంగా తీస్తామని ప్రకటించారు. కానీ అందుకోసం తొందరపడమని స్పష్టం చేశాడు. "అన్ని సినిమాల సీక్వెల్స్, ఫ్రాంఛైజీలు మంచి స్పందన తెచ్చుకుంటున్నాయి. అలాంటి సమయంలో భజరంగి భాయిజాన్ సీక్వెల్ చేయడం మంచి ఆలోచనే అవుతుంది. గత రెండు దశాబ్దాల్లో అత్యంత ఆదరణ పొందిన చిత్రాల్లో ఒకటైన చిత్రం ఇది. కానీ ఆ సినిమా క్రేజ్‌ను క్యాష్ చేసుకోవడానికి, స్వప్రయోజనాల కోసం సీక్వెల్ తీయాలనుకుంటే కరెక్ట్ కాదు. మేం సీక్వెల్ చేస్తే.. అది ఫస్ట్ పార్ట్ కంటే గొప్పగా ఉండాలి. అలాంటి కథ ఎప్పుడు రెడీ అయితే అప్పుడు సినిమాను మొదలుపెడతాం. అది ఈ ఏడాది కావచ్చు. వచ్చే ఏడాది కావచ్చు. ఇంకా టైం పట్టొచ్చు. కానీ కథ గొప్పగా తయారైనపుడే సినిమా మొదలవుతుంది" అని కబీర్ ఖాన్ చెప్పారు. మరి అంత గొప్ప కథను మళ్లీ విజయేంద్ర ప్రసాదే ఇస్తారా.. లేక కబీర్ వేరే రచయితల సాయంతో స్క్రిప్టు రెడీ చేస్తారా అన్నది చూడాలి.

# ఏజే ఫోటోగ్రఫీ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో

## ముఖ్య అతిథిగా తుంగతుర్తి రవి




**హైదరాబాద్ సిటీ బ్యూరో (మన వెలుగు) జులై 17 :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విష్ణుపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ జే ఫోటోగ్రఫీ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్య సభ్యులను అభినందించి తుంగతుర్తి రవి మాట్లాడుతూ, ఇది యువత కోసం ఒక మంచి అవకాశంగా నిలుస్తుందని, వారి క్రియేటివిటీకి మార్గం వేయాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. కొత్తగా ప్రారంభమైన ఫోటోగ్రఫీ షాప్ యాజమాని అయిన అజయ్ కి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు,వారి కుటుంబ సభ్యులు,స్నేహితులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాజా సాబ్ వెనక్కు తగ్గే ఛాన్సే లేదు




డిసెంబర్ 5 విడుదల కాబోతున్న ది రాజా సాబ్ డేట్ మారొచ్చనే ప్రచారం ఒక వర్గంలో మొదలు కావడంతో ప్రభాస్ ఫ్యాన్స్ అయోమయం చెందుతున్నారు. ఇప్పటికే పలు వాయిదాలకు లోనైన ఈ ప్యాన్ ఇండియా మూవీ చెప్పిన టైంకే రావాలని వాళ్ళ కోరిక. ఎవరు ఎలాంటి గాసిప్స్ మొదలుపెట్టినా రాజా సాబ్ రాకలో ఎలాంటి మార్పు ఉండదు. ఒకవేళ సంక్రాంతి ఆప్షన్ ఏమైనా చూస్తున్నారేమో అనే సందేహం రావొచ్చు. కానీ ఆ అవకాశం కూడా లేదు. ఎందుకంటే సోలో డేట్ వదిలేసి అనవసరంగా కాంపిటీషన్ లో దిగడం వల్ల ఓపెనింగ్స్ తో పాటు వసూళ్లు ఎఫెక్టవుతాయి. ప్రభాస్ వస్తాడని అందరూ తప్పుకోలేరుగా. ప్రాక్టికల్ గా చూస్తే డిసెంబర్ 5 బెస్ట్ డేట్. ఎందుకంటే అదే తేదీకి వచ్చిన పుష్ప 2 ది రూల్ రెండు వేల కోట్లకు దగ్గరగా వెళ్ళింది. పరిమిత మార్కెట్లతోనూ యానిమల్ డిసెంబర్ మొదటి వారంలో వచ్చి తొమ్మిది వందల కోట్లకు పైగా కొల్లగొట్టింది. ఇవి సోలోగా రావడం ఎంత పెద్ద మేలయ్యిందో డిస్ట్రిబ్యూటర్లను నిద్రలో లేపి అడిగినా చెబుతారు. ది రాజా సాబ్ కూడా ఇదే స్ట్రాటజీని ఫాలో కావాలని చూస్తోంది. ఎందుకంటే ఒకవేళ సంక్రాంతిని వెళదామనుకునా చిరంజీవి రావిపూడిల మెగా 157 బరిలోనే ఉంటుంది. డాకు మహారాజ్, గేమ్ ఛేంజర్ లను దాటుకుని సంక్రాంతికి వస్తున్నాంతో అనిల్ ఎంత పెద్ద హిట్టు కొట్టాడో చూశాం. రవితేజ కిషోర్ తిరుమల సినిమా, నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు ఆల్రెడీ అఫీషియల్ గా బరిలో ఉన్నాయి. అసలైనది మరొకటి ఉంది. విజయ్ జన నాయగన్ పొంగల్ కే వస్తుంది. రాజా సాబ్ కనక పండగ సీజన్ కోరుకుంటే తమిళనాడు, కేరళలో విజయ్ వల్ల ప్రభాస్ ఓపెనింగ్స్, థియేటర్ పంపకాలు ప్రభావితం చెందుతాయి.

# ఇండియన్ 3 మోక్షానికి రజనీకాంత్ చొరవ...?




లెజెండరీ హీరో అండ్ డైరెక్టర్ కమల్ హాసన్, శంకర్ లు ఎంత బ్యాడ్ ఫేజ్ లో ఉన్నారో చెప్పనక్కర్లేదు. ఇండియన్ 2, థగ్ లైఫ్ డిజాస్టర్లతో లోకనాయకుడు డీలా పడగా భారతీయుడు 2, గేమ్ ఛేంజర్ తో ఇండియన్ స్పిల్బర్గ్ తన భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేసుకున్నారు. వీళ్ళిద్దరి కలయికలో పెండింగ్ ఉండిపోయిన సినిమా ఒకటుంది. అదే ఇండియన్ 3. ఎప్పుడు ఎక్కడ రిలీజవుతుందో ఎవరికీ తెలియదు. కొందరు థియేటర్ అన్నారు, మరికొందరు ఓటిటి అన్నారు ఇంకొకరు అసలు వెలుగులోకి రాదన్నారు. ఇంత సందిగ్ధం మధ్యలో ఈ ప్యాన్ ఇండియా మూవీ మోక్షానికి రజనీకాంత్ చొరవ తీసుకున్నట్టు చెన్నై టాక్. తనకు బాగా కావాల్సిన లైకా ప్రొడక్షన్స్, శంకర్ తరఫున కమల్ హాసన్ తో మాట్లాడి వీలైనంత వేగంగా దీన్ని బయటికి తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేసుకోమని ముగ్గురితో మాట్లాడి ఒప్పించారట. బ్యాలన్స్ ఉన్న షూటింగ్, రీ రికార్డింగ్, డబ్బింగ్ తదితర కార్యక్రమాలకు ఎలాంటి రెమ్యునరేషన్ డిమాండ్ చేయకూడదనే నిబంధనకు కమల్, శంకర్ ఇద్దరూ అంగీకరించినట్టు వినికిడి. రిలీజయ్యాక ఒకవేళ సినిమా బ్లాక్ బస్టర్ అయితే ముందు వచ్చిన నష్టాలన్నీ పోను ఎంతైతే మిగులుతుందో దాని నుంచి పారితోషికాలు తీసుకోవచ్చుట. అధికారికంగా ఇదంతా బయటకు చెప్పలేదు కానీ కోలీవుడ్ వర్గాల్లో టాక్ ఉంది. నిజానికి అసలైన కథ ఇండియన్ 3లోనే ఉంది. కేవలం సీక్వెల్ క్రేజ్ మీద ఎక్కువ డబ్బు చేసుకునే ఉద్దేశంతో ఇండియన్ 2ని చుట్టేయడం దారుణమైన ఫలితాన్ని ఇచ్చింది. ఫలితంగా మూడో భాగం మీద కొంచెం కూడా క్రేజ్ లేకుండా పోయింది. ఇప్పుడు మార్గం సుగమం కావడం అభిమానులకు శుభ వార్తే. సేనాపతి ఉగ్రవాదిగా మారడానికి కారణాలు, బ్రిటిషర్లతో అతను చేసిన యుద్ధాలు తదితర చాలా అంశాలు ఇండియన్ 3లో ఉండబోతున్నాయి. అనిరుద్ రవిచందర్ అందించిన మెయిన్ సాంగ్స్ ఇందులో చూడచ్చు. కమల్ కు జోడిగా కాజల్ అగర్వాల్ దర్శనం కూడా పార్ట్ 3లోనే జరగనుంది. చూద్దాం ఇదెంతవరకు నిజమో.

# రత్నం హిట్టు కొట్టడం అత్యవసరం



హరిహర వీరమల్లు హిట్టవ్వాలనేది కంటెంట్ మీద ఆధారపడినప్పటికీ దీని గెలుపు పవన్ కళ్యాణ్ కంటే ఎక్కువ నిర్మాత ఏఎం రత్నంకు చాలా అవసరం. ఫ్యాన్స్ కోరుకుంటున్నది కూడా అదే. అయిదేళ్ల నిర్మాణం. లెక్కలేనన్ని వాయిదాలు. వందల కోట్ల ఖర్చు. ఎదురు చూడటంలోనే సంవత్సరాలు గడిచిపోయాయి. అడిగితే పవన్ ఒక కమర్షియల్ మూవీ అయినా సరేననే వారు. కానీ రత్నం లక్ష్యం అది కాదు. ఎప్పటికి మర్చిపోలేని ఒక విజువల్ గ్రాండియర్ ఇవ్వాలి. ఇప్పటిదాకా పవన్ కళ్యాణ్ చేయని జానర్ ని టచ్ చేయాలి. బాహుబలి లాంటి ల్యాండ్ మార్క్ మూవీ తన బ్యానర్ లో ఎప్పటికీ ఉండిపోవాలి. కరోనా బ్రేకులు, మధ్యలో సెట్లకు జరిగిన ప్రమాదాలు, దర్శకత్వం నుంచి క్రిష్ తప్పుకోవడం లాంటి ఎన్నో అవాంతరాలు వీరమల్లుని చాలా ఇబ్బంది పెట్టాయి. ఇంకో ప్రొడ్యూసర్ అయితే మధ్యలోనే చేతులు ఎత్తేసేవారేమో కానీ రత్నం మాత్రం తప్పుకోలేదు. అన్ని సిద్ధమనుకుని రిలీజ్ డేట్ ప్రకటించాక కూడా వాయిదా వేయాల్సి రావడం, విఎఫెక్స్ కంపెనీల చుట్టూ తిరగడం ఇలా మామూలు నరకం చూడలేదు. ఆఖరికి నెల రోజుల క్రితం జూలై 24 డేట్ అనౌన్స్ చేశాక సైతం ఫ్యాన్స్ అనుమానంగా చూశారంటే ఈ ప్రాజెక్టు ఎన్ని ఆటుపోట్లు, అవమానాలకు గురయ్యిందో అర్థం చేసుకోవచ్చు. వాటికి సమాధానం చెప్పాలి. ఇంత జరిగినా రత్నం కాన్ఫిడెంట్ గా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల హక్కులను గంపగుత్తగా అమ్మకుండా అడ్వాన్స్ పద్ధతి మీద స్వంతంగా రిలీజ్ చేసేందుకు నిర్ణయించుకున్నారట. కొన్ని ఏరియాలు మినహాయించి దాదాపు ఇదే చేస్తారని సమాచారం. ఇన్ని వాయిదాలు, రిస్కులు భరించి హరిహర వీరమల్లు ఎట్టకేలకు థియేటర్లలో అడుగు పెట్టనుంది.

# వినడమే జీవన సాఫల్యం



ప్రపంచ శ్రవణ దినోత్సవం అనే విశిష్ట దినోత్సవం ప్రతి సంవత్సరం జూలై 18వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. మన చుట్టూ ఉన్న శబ్దాల ప్రపంచాన్ని, శ్రవణ అనుభూతిని, మరియు శబ్దాల ద్వారా మన సంస్కృతుల, పరిసరాల పట్ల మన బంధాన్ని గుర్తు చేసుకోవడానికి ఈ దినోత్సవం ఒక విలక్షణమైన వేదిక. శబ్దానికి సంబంధించిన చైతన్యాన్ని పెంపొందించడం, శ్రవణ సామర్థ్యానికి ప్రాధాన్యత నివ్వడం, శబ్ద కాలుష్యాన్ని అరికట్టే శబ్దాలను స్వాగతించడం, వాటిని శ్రద్ధగా విన గలాగడం, వాటి వెనుకనున్న ప్రకృతి, భావం, జీవితాన్ని అర్థం చేసుకోవాలి అనే సంకల్పంతో జరుపుకునే ఈ దినోత్సవం వినికిడి అనే ప్రక్రియను వ్యక్తిత్వ వికాసానికి, పర్యావరణ పరిరక్షణకు, మానవ సంబంధాల మెరుగుదలకూ మార్గంగా చూపుతుంది. ఈ దినోత్సవాన్ని కెనడాకు చెందిన ప్రసిద్ధ స్వరకర్త, శబ్ద పర్యావరణ శాస్త్రవేత్త, రచయిత అయిన ఆర్. ముర్రే షేఫర్ జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుతారు. శబ్ద భౌగోళిక శాస్త్రానికి పితామహుడిగా గుర్తింపు పొందిన షేఫర్ స్థాపించిన వరల్డ్ సౌండ్‌స్కేప్ ప్రాజెక్ట్ ద్వారా శబ్దాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయాలనే ఆలోచనకు బలమైన పునాదులు ఏర్పడ్డాయి. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం వినే సామర్థ్యానికి ప్రాధాన్యత నివ్వడం, శ్రవణ నైపుణ్యాలను ప్రజల్లో అభివృద్ధి చేయడం, శబ్ద పర్యావరణంపై అవగాహన పెంపొందించడం. వినడం అనేది కేవలం చెవుల ద్వారా శబ్దాలను గ్రహించడమే కాదు, అది మనసుతో కూడిన అవగాహన ప్రక్రియ. శ్రద్ధగా వినడం ద్వారా ఇతరుల భావోద్వేగాలను అర్థం చేసుకోవచ్చు, గౌరవించవచ్చు. సంభాషణల్లో స్పష్టత, సంబంధాల్లో గాఢత, సమస్యల పరిష్కారంలో లోతైన అర్థం వినికిడి ద్వారానే సాధ్యమవుతుంది. వినడం ఒక జీవిత నైపుణ్యం, అది అభ్యాసంతో బలపడే సామర్థ్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు పదిహేను కోట్ల మందికి పైగా వ్యక్తులు శ్రవణ సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్యలు శబ్ద కాలుష్యం వల్ల మరింత తీవ్రంగా మారుతున్నాయి. పరిశ్రమల శబ్దం, వాహనాల మోత, నగరాల్లో పెరిగిన శబ్ద స్థాయిలు, నిరంతరంగా వినిపించే హార్న్‌లు వంటివి మానవ శ్రవణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. శబ్ద కాలుష్యం వల్ల నిద్రలేమి, మానసిక ఆందోళన, రక్తపోటు, హృదయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయని అధ్యయనాలు స్పష్టంగా సూచిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన విధంగా రాత్రిపూట శబ్ద స్థాయి 40 డెసిబెల్స్ లోపు ఉండాలి. కానీ భారతదేశం లోని మెట్రో నగరాల్లో ఇది 65 నుండి 85 డెసిబెల్స్ వరకు నమోదవుతోంది. ఈ విషయం శ్రవణ పరిరక్షణకు ఎంత అప్రమత్తత అవసరమో తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రపంచ శ్రవణ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత మరింత పెరిగింది. ఈ దినోత్సవం సందర్భంగా అనేక దేశాలలో శ్రవణ కళలను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. సౌండ్‌వాక్‌లు ద్వారా ప్రజలను తమ పరిసరాల శబ్దాల పట్ల శ్రద్ధగల వారుగా తయారు చేస్తారు. శ్రవణ కళా ప్రదర్శనలు, శాస్త్రీయ సెమినార్లు, వర్క్ షాపులు, సంగీత కచేరీలు వంటి కార్యాచరణలు వినే సంస్కృతిని అభివృద్ధి చేయడంలో తోడ్పడతాయి. ప్రతి సంవత్సరం ఈ దినోత్సవానికి ఒక ప్రత్యేకమైన థీమ్‌ను నిర్ణయిస్తారు. 2023లో "భవిష్య శ్రవణం" అనే అంశంతో, 2024లో "దూరపు వినికిడి" అనే అంశంతో నిర్వహించారు. ఈ థీముల ప్రకారం కళాకారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలతో ముందుకొస్తారు. శ్రవణాన్ని ఒక కళగా, విజ్ఞానంగా, జీవన విలువగా చూడటానికి ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తోంది. భారతదేశంలో కూడా శబ్ద కాలుష్య నియంత్రణకు చర్యలు చేపడుతున్నా, అవి పరిమిత స్థాయిలోనే ఉన్నాయి. కొన్ని నగరాల్లో నాయిస్ మ్యాపింగ్ ద్వారా శబ్ద స్థాయిని కొలుస్తున్నారు. మౌన ప్రదర్శనలు, శబ్ద వినికిడి ప్రయోగాలు, కళా కార్యక్రమాలు పలు విద్యా, పర్యావరణ సంస్థలు నిర్వహిస్తున్నాయి. అయినా, వినే సామర్థ్యాన్ని విలువైన శక్తిగా గుర్తించి శ్రద్ధా శ్రవణాన్ని జీవితంలో భాగం చేసుకోవాలనే చైతన్యం ఇంకా విస్తృత స్థాయిలో ఏర్పడాల్సి ఉంది. శ్రవణం ప్రకృతితో మన బంధాన్ని మరింత బలపరుస్తుంది. కోయిల కూత, వర్షపు చినుకుల రమణీయత, అడవి జంతువుల అరుపులు, సముద్ర తరంగాల గర్జనలు – ఇవన్నీ మన శ్రవణ అనుభవాన్ని భౌతికానికి అందని పరవశ స్థాయికి తీసుకెళ్తాయి. ప్రకృతి ధ్వనులను మనసు పోగా వినగల సామర్థ్యం మనల్ని మానవతా వాదులుగా మలచ గలదు. శ్రవణం ఒక ధ్యాన ప్రక్రియ. అది మౌనాన్ని అర్థం చేసుకునే మార్గం. ఈ శ్రవణం ద్వారా మనం ప్రపంచాన్ని మరింత లోతుగా, ప్రశాంతంగా, స్పృహతో చూడ గలుగుతాం. ప్రపంచ శ్రవణ దినోత్సవం వినే సామర్థ్యానికి అంకితమైన ఒక సాంస్కృతిక ఉద్యమంగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక రోజు జరుపుకునే కార్యక్రమం మాత్రమే కాదు, శ్రవణాన్ని ఒక జీవన విలువగా అభివృద్ధి చేసుకునే అవకాశం. ఈ దినాన్ని పురస్కరించుకొని మనమందరం ఒక్కసారి చుట్టూ ఉన్న ప్రకృతిని గమనించుదాం, మౌనాన్ని అలవర్చుకుందాం, శ్రద్ధగా వినే మనస్తత్వాన్ని మన జీవితాలలో నాటుదాం. వినడం ద్వారా అర్థం, అనుభూతి, అవగాహన పెరుగుతుంది. శ్రవణం ద్వారా మనిషి మౌనాన్ని అర్థం చేసుకుంటాడు. ఆ మౌనం లోనే ఉన్నది ప్రకృతి, శాంతి, జ్ఞానం. అందుకే వినే సామర్థ్యం మనకు అనుగ్రహం మాత్రమే కాదు, బాధ్యత కూడా. శ్రవణం మనిషి సంస్కృతికి మూలపునాది. దానిని గౌరవించాల్సిన సమయం ఇది.

# డిఫరెంట్ కాన్సెప్ట్‌తో..



వైరల్ షార్ట్ ఫిల్మ్‌గా పేరొందిన 'ఆ గ్యాంగ్ రేపు', దానికి స్వీకెల్‌గా రూపొందిన 'ఆ గ్యాంగ్ రేపు-2' షార్ట్ ఫిల్మ్‌ను తెరకెక్కించిన టీమ్ నుండి రాబోతున్న మరో క్రైమ్ థ్రిల్లర్ 'ఆ గ్యాంగ్ రేపు-3'. త్వరలోనే ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు యోగేష్ కుమార్ మాట్లాడుతూ,'2015లో అనుకోకుండా నేను చేసిన చిన్న ప్రయత్నం వైరలై, మంచి గుర్తింపు తెచ్చింది. 'గ్యాంగ్ రేపు 2ః కూడా హిట్ అయ్యింది. నా స్నేహితుడు ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో చేసిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది. అందర్ని అలరించే సన్నివేశాలు ఈ చిత్రంలో చాలా ఉంటాయి' అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ట్రైలర్‌లోనే దర్శకుడి విజన్ అర్థమైపోతుంది. మంచి టీమ్‌తో చేసిన సినిమా ఇది. అందరూ హార్డ్ వర్క్‌తో చేసిన ఈ సినిమా తప్పకుండా విజయవంతం అవుతుంది' అని నిర్మాత నోక్షియస్ నాగ్స్ అన్నారు. నరేన్ అన్నసాగరం, ప్రీతి సుందర్, సందీప్ సాండిలియా, దయానంద్ రెడ్డి, మహిపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి బ్యానర్: సహచర ప్రొడక్షన్స్, నిర్మాత: నోక్షియస్ నాగ్స్, దర్శకుడు: యోగేష్ కుమార్, డీఓపీ: నాని ఐనవల్లి, సంగీతం: కబీర్ రఫీ, ఎడిటర్: అనిల్ కుమార్ జల్లు.

# సామాజిక మార్పుకు సాధనం సాహిత్యం

ఒంటాల గోపాలకృష్ణ, (5 సెప్టెంబర్ 1920 –18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామాజిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది. సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది. అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి. విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి. సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు. రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి – పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు. రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు. ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది – సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు – ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు – అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

# విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు

తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రత్యేక విలక్షణ నటులు ఎస్వీ రంగారావు. రంగారావు తన నటనలో ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికా భినయాలు కలబోసిన నటుడు. సహజ నటుడిగా పేరు గాంచారు. పౌరాణిక, సాంఘిక, చారిత్రిక, ఐతిహాసిక పాత్రలు ఏవైనా వాటిల్లో పరకాయ ప్రవేశం చేసి, అందరి మన్ననలు పొందిన మహానటులు యస్వీఆర్. నవరసాలను అలవోకగా అవలీలగా పాత్రల ద్వారా ఒలికించిగల అతికొద్ది మంది నటుల్లో ఎస్వీఆర్ ది అగ్రస్థానం. ఎస్వీ రంగారావు కృష్ణా జిల్లా లోని నూజివీడులో, 1918 జూలై 3 వ తేదీన జన్మించారు. మద్రాసు హిందూ హైస్కూలులో తన పదిహేనవ ఏట మొదటి సారిగా నాటకంలో నటించారు. తన నటనకు అందరి నుంచి ప్రశంసలు రావడంతో ఆయనలో నటుడు కావాలన్న కోరికకు బీజం పడింది. తర్వాత పాఠశాలలో ఏ నాటకం వేసినా ఏదో ఒక పాత్రలో నటించేవారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొనేవారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ క్రీడల్లోనూ ప్రవేశం ఉండేది. 1936 లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలలో రంగారావు బళ్ళారి రాఘవ, గోవిందరాజు సుబ్బారావు లాంటి ప్రఖ్యాత నటులను చూసి తాను కూడా ఎలాగైనా నటుడు అవ్వాలనుకున్నారు. మద్రాసులో ఎక్కడ తెలుగు నాటకాలు జరుగుతున్నా హాజరయ్యేవారు. అన్ని భాషల సినిమాలు శ్రద్ధగా చూసేవారు. వాటిని విశ్లేషించేవారు. ఇంటర్ పరీక్షకు 45 మంది హాజరయితే అందులో రంగారావు ఒక్కడే ఉత్తీర్ణుడు కావడం విశేషం. రంగారావు కు మాత్రం నటుడు కావాలనే కోరిక బలంగా ఉండేది. బాగా చదువుకుంటూనే నటనను కూడా వదిలి పెట్టలేదు. కాకినాడ లోని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ లో చేరి ఎన్నో నాటకాల్లో పాల్గొన్నారు. ఆయనకు ఇక్కడ అంజలీదేవి, ఆదినారాయణ రావు, బి.ఎ.సుబ్బారావు, రేలంగి వంటి వారితో పరిచయం ఏర్పడింది. నాటకాల్లో రంగారావు అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించారు. పీష్వా నారాయణరావు వధ నాటకంలో రంగారావు ఇరవై రెండేళ్ళ వయసులో అరవై ఏళ్ళ వృద్ధుని పాత్ర ధరించి మెప్పించారు. ఖిల్జీ రాజ్యపతనసం నాటకంలో మాలిక్ కపూర్ పాత్రలో, స్ట్రీట్ సింగర్ నాటకంలో విలన్ పాత్ర మొదలైన పాత్రలు పోషించారు. రంగారావు కు ఇంగ్లీషు మీద కూడా పట్టు ఉండటంతో షేక్స్‌పియర్ నాటకాల్లోని సీజర్, ఆంటోనీ, షైలాక్ లాంటి పాత్రలు పోషించేవారు. నాటకాలు వేస్తూనే బి. ఎస్. సి పూర్తి చేశారు. మొదట బందరు లో తర్వాత విజయ నగరంలో ఫైర్ ఆఫీసరు గా పనిచేశారు. ఈ ఉద్యోగంలో రంగారావుకు పెద్దగా పని ఉండేది కాదు. కానీ ఉద్యోగ స్వభావ రీత్యా ఖాళీ సమయాల్లో నటించడానికి వీలులేదు. తాను కళకు దూరం అవుతున్నేనేమో నని భావించిన రంగారావు ఆ ఉద్యోగం నుంచి బయటకు వచ్చేశారు. ఆయన నటించిన మొట్టమొదటి చిత్రం 1946లో వచ్చిన వరూధిని అనే చిత్రం. తొలి సినిమాలో పాత్ర పోషించినందుకు గాను రూ.750 పారితోషికంగా అందుకున్నారు. ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన మనదేశం, పి. పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన తిరుగుబాటు చిత్రంలో కూడా అంతగా ప్రాధాన్యం లేని పాత్రలే వచ్చాయి. అయినా రంగారావు నిరుత్సాహ పడకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూడ సాగారు. నాగిరెడ్డి, చక్రపాణి కలిసి విజయా ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ తొలిసారిగా నిర్మించిన షావుకారు సినిమాలో సున్నపు రంగడు అనే కీలకమైన పాత్రను రంగారావు కిచ్చారు. ఈ సంస్థలో ప్రవేశించడం రంగారావు కెరీర్ కు గట్టి పునాది పడింది. తర్వాత అదే సంస్థ నిర్మించిన పాతాళ భైరవి (1951) సినిమాలో అతి ముఖ్యమైన మాంత్రికుడి పాత్రను రంగారావు కిచ్చారు. పరభాషా సినిమాలు కూడా ఎన్నో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. హిందీ భాషలో ప్రవేశమున్న రంగారావు తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. భానుమతి దర్శక నిర్మాత వచ్చిన నాది ఆడజన్మే ఆధారంగా హిందీలో తీసిన మై భీ లడ్కీ హూ లాంటి హిందీ చిత్రాల్లో నటించారు. భూకైలాస్, మాయాబజార్ లాంటి కన్నడ చిత్రాలలోనూ, విదయాగలే ఎతిలే ఎతిలే, కవిత వంటి మలయాళ చిత్రాలలో కూడా నటించారు. నటసామ్రాట్, విశ్వనట చక్రవర్తి మొదలగు బిరుదులతో తెలుగు ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు. ఎస్వీయార్ నటించిన నర్తనశాల ఇండొనేషియా లోని జకార్తాలో ఆఫ్రో-ఆసియా అంతర్జాతీయ చిత్రోత్సవము?లో ప్రదర్శించ బడడమే కాకుండా కీచకపాత్రకు గాను ఎస్వీయార్ అప్పటి ఎన్నో చిత్రాల కథా నాయకులను వెనుకకు నెట్టి భారతదేశం నుంచి తొలి అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. కొన్ని చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ముఖ్యంగా ఆయన దర్శకత్వం వహించిన చదరంగం చిత్రానికి రెండో ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం లభించింది. రెండో చిత్రం బాంధవ్యాలు ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం అందుకున్నది. మొదటి సినిమా వైఫల్యం తర్వాత రంగారావు జంషెడ్పూర్ లో టాటా కంపెనీలో ఉద్యోగం లో చేరారు. ఇదే సమయంలో ఆయన మేనమామ బడేటి వెంకట రామయ్య, కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె లీలావతిని 1947 డిసెంబరు 27న వివాహం చేసుకున్నారు. వ్యక్తిగా రంగారావు చమత్కారి, సహృదయుడు. సినిమా సెట్స్ మీద గంభీరంగా ఉండేవారు. వ్యక్తిగత విషయాలు సహనటులతో చర్చించడానికి ఇష్టపడేవారు కాదు. ఆయన ఇష్టదైవం శివుడు. ప్రతిరోజూ శివపూజ చేసిన తర్వాత దినచర్య ప్రారంభించేవారు. యస్వీఆర్ ఒక వేదాంతి. ఆయన ఇంటి లైబ్రరీలో వివేకానందునికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉండేవి. తానే స్వయంగా కొన్ని రచనలు కూడా చేశారు. ప్రజాహిత సంస్థలకు లెక్కలేనన్ని విరాళాలు ఇచ్చారు. చైనాతో యుద్ధం వచ్చినపుడు ఏర్పాటు చేసిన సభలో పదివేల రూపాయలు విరాళం ఇచ్చారు. తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చినపుడు కూడా ఎన్నో సభలు నిర్వహించి, మిగతా నటులతో కలసి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, విరాళాలు సేకరించి, ఆ డబ్బును రక్షణ నిధికి ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, పాలకొల్లు, సామర్లకోట, పెనుగొండ, అనకాపల్లి లాంటి ఊర్లలో ఆయనకు సన్మానాలు జరిగాయి. జకార్తాలో పురస్కారం అందుకుని మద్రాసు వచ్చాక మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ , ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్టు సంఘం , దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య మండలి, మద్రాసు సినిమా ప్రేక్షక సంఘాలు ఘనంగా సన్మానించారు. అన్నై, శారద, నానుం ఒరుపెణ్, కర్పగం, నర్తనశాల సినిమాలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పారితోషికం స్వీకరించారు. విశ్వనటచక్రవర్తి, నటసార్వభౌమ, నటసింహ, నటశేఖర తదితర బిరుదులు పొందారు. రంగారావు దర్శకత్వం వహించిన మొదటి చిత్రం చదరంగం ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును, రెండవ చిత్రం బాంధవ్యాలు తొలి ఉత్తమ చిత్రంగా నంది అవార్డును గెలుచుకున్నాయి. నర్తనశాల చిత్రంలో నటనకు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ నటుడి అవార్డు, అదే పాత్రకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నాడు. 2013 లో భారత సినీ పరిశ్రమ వందేళ్ళ సందర్భంగా విడుదలయిన తపాళాబిళ్ళలలో ఒకటి ఎస్వీ రంగారావు మీద విడుదలయింది. రంగారావుకు తొలినాళ్ళలో మంచి పేరు తెచ్చిన షావుకారు చిత్రంలోని సున్నం రంగడి పాత్ర కోసం తన స్వగ్రామంలో కోడి రంగడు అనే రౌడీని మనసులో పెట్టుకుని అతని మాట తీరుని, ప్రవర్తనా విధానాన్ని అనుకరించారు. సంతానం చిత్రంలో ఆయన పోషించిన గుడ్డివాని పాత్ర కోసం కొన్నాళ్ళు పాటు అంధుల ప్రవర్తనను గమనించారు. మాంత్రికుడి పాత్ర కూడా తాను ఆంగ్ల నాటకాల్లో ధరించిన షైలాక్ పాత్రలను ఆధారంగా చేసుకుని మరింత రౌద్రరసాన్ని కలిపి తనదైన శైలిలో నటించారు. రంగారావు యముడి పాత్ర పోషించిన సతీ సావిత్రి సినిమా మద్రాసులో జెమినీ స్టూడియోలో చిత్రీకరణ జరుగుతుండగా మద్రాసు పర్యటనకు వచ్చిన చైనా ప్రధాని చౌ ఎన్ లై ఈయన నటనను అభినందించారు. జులై 3, 2018న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏలూరులో పన్నెండున్నర అడుగుల ఎత్తైన రంగారావు కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1974 జూలై 18వ తేదీన మద్రాసులో కన్ను మూశారు.